క్లుప్తంగా

పాఠశాలల్లో తనిఖీ


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వెలుగుమట్ల గుట్టపై ఉన్న కేజీబీవీ, పుట్టకోట ప్రభుత్వ పాఠశాలను ఖమ్మం అర్బన్ ఎంఈఓ కే.వీ.శైలజలక్ష్మి, 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఉపయోగిస్తున్న సరుకులను పరిశీలించి వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ ఆధారంగా నాణ్యమైన భోజనం సమకూర్చాలని సూచించారు.

న్యాయవాది మృతికి సంతాపం



మాట్లాడుతున్న కొల్లి సత్యనారాయణ

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన న్యాయవాది, ప్రజా హక్కుల ఉద్యమ కార్యకర్త, ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు చల్లా శంకర్ మృతి చెందగా సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు జిల్లా కోర్టులో న్యాయమూర్తి రాజగోపాల్ ఆధ్వర్యంలో రిఫరెన్స్ నిర్వహించారు. తిరుమలరావు, సుగుణ రావు, కొల్లి సత్యనారాయణ, లతీఫ్, తొండపు వెంకటేశ్వర్లు, క్రాంతి కుమార్, విప్లవ్ కుమార్, ఉపేందర్ రెడ్డి ఉన్నారు.

సాయితేజ మృతికి మాజీ ఎంపీ..

ఖమ్మంమయూరిసెంటర్: చికాగోలో హత్యకు గురైన నగరంలోని రాపర్తి నగర్‌కు చెందిన నూకారపు సాయితేజ మృతికి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి హత్యకు గురికావడం బాధాకరమన్నారు. విదేశాల్లో విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.

ఆర్పీ తీరుపై విమర్శలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఓ డివిజన్‌కు చెందిన ఆర్పీ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సంఘంలో కొనసాగలేక ఓ మహిళ సంఘం నుంచి తన పేరును తొలగించాలని కోరగా.. తీర్మాణం రాయాలని, అందుకు రూ.500 ఇవ్వాలని ఆర్పీ సదరు మహిళను అడిగినట్టు చర్చ జరుగుతోంది. సంఘంలో చేరాలన్నా, రుణాలు ఇప్పించాలన్నా ఆర్పీలకు కమీషన్లు తీసుకోడం అలవాటు అయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్పీల తీరుతో మహిళలు సంఘాల్లో కొనసాగలేక తప్పుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చినా స్పందించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రెగ్యులర్ చేయాలి

ఖమ్మంఅర్బన్: విద్యాశాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు సోమవారం డీఈఓ, అర్బన్ ఎంఈఓ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. ఉద్యోగులు చేస్తున్న నిరసనకు పీఆర్‌టీయు సంఘం నాయకులు తమ సంఘీభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట శేఖర్, మండల అధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు ఉన్నారు.

రాష్ట్ర కోఆర్డినేటర్‌గా రెహమాన్



ఖమ్మం మయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం): పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఖమ్మంకు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ నియమితులయ్యారు. ఈమేరకు వ్యవస్థాపక చైర్మన్ డి.మాధవరావు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రెహమాన్‌ను పలువురు అభినందించారు.

రుణమాఫీ చేయాలి

ఖమ్మంరూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకులు నండ్ర ప్రసాద్, మండల కార్యదర్శి వి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపేందర్, పి. మోహన్‌రావు, ఎస్.కృష్ణ, కె.గురవయ్య, పి. సుమతి పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతం

ఖమ్మం మయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం) : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన విజయవంతం అయినట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం తెలిపారు. సోమవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా..

- ఆయిల్ పాం సాగుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కంటే అధిక ఆదాయం
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

రఘునాథపాలెం: గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు తీసుకొస్తే తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన ప్రజల రుణం తీర్చుకున్నట్టు అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని శివాయిగూడెం, పువ్వాడనగర్, మంచుకొండ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంచుకొండలో జరిగిన సభలో మాట్లాడారు. రఘునాథ పాలెం మండలంలో చెరువులు నింపేందుకు సాగర్ నీళ్లను అత్యవసరంగా తీసుకురావాలని రూ.66 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం శ్రీకారం చుట్టామని ప్రజలు సహకరిస్తే సంక్రాంతి నాటికి పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పాం పంట సాగు చేయాలని, ఆయిల్ పాం పంటకు కోతులు, అకాల వర్షాల సమస్యలు ఉండవని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కంటే అధికంగా ఆదాయం వస్తుందన్నారు. చెరువుల పునరుద్ధరణ, ఎత్తిపోతల పథకం, కాలువల నిర్మాణం చేశామని, మిగిలిన పనులు సైతం ఈనాలుగు సంవత్సరాల కాలంలో పూర్తి చేస్తామన్నారు. ఈఏడాది కాలంలోనే రూ.500 కోట్లతో రఘునాథపాలెం మండల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యత అందిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఎటువంటి అవకతవకలు పాల్పడొద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ విల్సన్‌బెన్నీ, ఎంపీడీఓ అశోక్, డీఈ మహేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీపక్, విజయ, చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు పుష్పలత, స్వరూపరాణి, నల్లమల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, యరగర్ల హనుమంతురావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కరుణాకర్‌రెడ్డి, బాలాజీనాయక్, లకావత్‌సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాయితేజ కుటుంబానికి పరామర్శ

ఖమ్మంవన్‌టౌన్: అమెరికాలోని చికాగో నగరంలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన ఖమ్మంకు చెందిన సాయితేజ కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. రాపర్తినగర్‌లోని వారి నివాసంలో సాయితేజ తండ్రి నూకారపు కోటేశ్వరరావును పరామర్శించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. అమెరికాలోని తానా ప్రతినిధులతో మాట్లాడి వీలైనంత త్వరగా మృతదేహాన్ని రప్పించేలా కృషి చేస్తానని చెప్పారు. నాయకులు సాధు రమేష్‌రెడ్డి మానుకొండ రాధాకిషోర్, చోటుబాబా, నాగండ్ల నరేందర్, శెట్టి రంగారావు, నలమల ఆనంద్, లక్ష్మణ్, తాళ్లూరి సృజన్‌కుమార్, తోటకూరి శివయ్య, గుడవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినతులను పరిశీలించి పరిష్కరించాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య


ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌కు వచ్చిన వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని, జాప్యం చేయొద్దని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు అందుకున్నారు. పారిశుద్ధ్య సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని శానిటరీ సూపర్‌వైజర్‌ను కమిషనర్ ఆదేశించారు. హెయిర్ కటింగ్ షాపుల వద్ద కత్తిరించిన జుట్టు బయట పడవేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుకు స్పందించిన కమిషనర్ బయట పడవేయకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే షాపుల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో ఉన్న గ్రంథాలయాల్లో వార్తపత్రికలు వేయించాలని విన్నవించగా త్వరలోనే గ్రంథాలయాల్లో వార్తపత్రికలు వేయించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, ఏవో శివలింగం, టీపీఎస్ నరేష్‌కుమార్, ఏఎస్‌వో లింగయ్య, ఆర్‌ఐ జ్యోతి, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, టీఎంసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల పరిస్థితి దయనీయం



మాట్లాడుతున్న కందుల మధు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో 18కి పైగా గురుకుల పాఠశాలలను సందర్శించామని, ఏ గురుకులంకు వెళ్లి చూసినా విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని గురుకుల పోరుబాట జిల్లా ఇన్‌చార్జ్ కందుల మధు అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గురుకులాలు అపరిశుభ్ర వాతావరణంలో ఉన్నాయని, కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. తక్షణమే మంత్రులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కోఆర్డినేటర్ కొరెపల్లి మహర్షి, ఉపేందర్‌రెడ్డి, మేడి అనిల్, మామిడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సర్వే


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడులో 409 సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన భూమిలో సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సర్వేయర్‌లు సర్వే నిర్వహించారు. అనంతరం ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని హద్దులు నిర్ణయించి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ... ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి..


కలెక్టర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని శ్రద్ధగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో సోమవారం మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సులో ఆయన మాట్లాడారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ట, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, డీసీపీఓ విష్ణువందన, కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజ్‌కుమార్, డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, డాక్టర్ ఏవీవీ.శివప్రసాద్, డాక్టర్ జె.రవీంద్రబాబు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామేపల్లి: మండలంలోని పాతలింగాల కేజీబీవీ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హత ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి ఈ నెల 5లోపు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు స్పెషల్ ఆఫీసర్ సీహెచ్.స్వాతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పీజీసీఆర్‌టీ సివిక్స్–1, నర్సింగ్–1 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు స్థానిక కళాశాలలో దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు.

హామీలు అమలుచేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట హామీలు అమలు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, కంకణాల అర్జున్‌రావు, బీరెల్లి లాజర్, సోములు, ఈర్ల వెంకటఅప్పారావు, వెంకటేశ్వర్లు, మంగతాయి, పాపారావు పాల్గొన్నారు.

7 నుంచి 'సీఎం కప్'

కూసుమంచి: ఈ నెల 7 నుంచి 12 వరకు గ్రామ, మండల స్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ఎంఈఓ శేషగిరి రావు, పీడీ, పీఈటీలతో సమావేశాన్ని నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'మభ్యపెడుతూ పాలన'

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆరోపించారు. మండల కేంద్రంలోని సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తీరుకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు దుర్గారావు, నాగేశ్వరరావు, యువమోర్చా మండల అధ్యక్షుడు నాగచారీ, కొండ హర్ష, గెల్లా నాగసాయి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు పుష్కర్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం అందించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, మీరా, అనిత పాల్గొన్నారు.

వినతి

ఖమ్మం మయూరి సెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు అన్నారు. సోమవారం (సీఐటీయూ) ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖమ్మంలో తాండ్ర వినోద్‌రావు కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నున్నా రవి, అల్లిక అంజయ్య, దొంగల సత్యనారాయణ, సుదర్శన్, నర్సింహారావు, మాధవ్ పాల్గొన్నారు.

టీఎస్‌టీటీఎఫ్‌లో చేరిక

ఖమ్మంసహకారనగర్: నగరంలోని బంజారా భవనంలో సోమవారం టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌టీటీఎఫ్‌లోకి ఇతర సంఘాల నాయకులు చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వీరు నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలను అమలు పరిచి జీవోలను విడుదల చేయాలన్నారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు శివ నాయక్, రాములు నాయక్, మంగినాయక్, బాలకష్ణ నాయక్, రమేష్ రాథోడ్, నరసింహారావు, బస్కి, హమ్ముమా, లకావత్ రాందాస్, శివ నాయక్, మన్య నాయక్, సీతారాం, పాపాలాల్ తదితరులు పాల్గొన్నారు .

పింఛన్లు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని ఆయా గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో సీపీఎం నాయకులు తహసీల్దార్ పీవీ.రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరం కావస్తున్నా ప్రభుత్వం మంజూరు చేయడం లేదన్నారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు సత్యనారాయణ, యాదగిరి, నవీన్, నాగేశ్వరరావు, శంకర్, లక్ష్మినారాయణ, రామారావు, వెంకటేష్, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ శ్రేయస్సుకు కట్టుబడి ఉండాలి



మాట్లాడుతున్న కృష్ణ

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): డ్రైవింగ్ స్కూల్ యూనియన్ శ్రేయస్సుకు కట్టుబడి ఉండాలని జిల్లా కార్ డ్రైవింగ్ స్కూల్ గౌరవ అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.ముస్తఫా, గౌరవ సలహదారులు పిండిప్రోలు రామ్మూర్తి కోరారు. సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... డ్రైవింగ్ నిర్వాహకులు ఒకే ఫీజు నినాదంతో శిక్షణ ఇవ్వాలని, యూనియన్ రేట్ల ప్రకారం శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రధాన కార్యదర్శి మధు,కార్యదర్శి జాకీరుద్దిన్, ఉపాధ్యక్షులు ఎం.కృష్ణారెడ్డి, సభ్యులు సీతారాములు, పీవీ.స్వామి, అరవింద్ ఉన్నారు.

'అధికారం కోసం దేశం చిన్నాభిన్నం'

ఖమ్మం మయూరి సెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): అధికారం కోసం దేశాన్ని బీజేపీ చిన్నాభిన్నం చేస్తుందని తంజీం ఏ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం విమర్శించారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దర్గాలు, లింగాల పేరుతో సమస్యలను సృష్టించడం, నిరసన తెలిపిన వారిపై కాల్పులు జరపటం సరైందికాదన్నారు. ఎండి.రెహమాన్, షేక్‌మీరా, ఖాసీం పాషా, అబ్దుల్ వహీద్, అబ్దుల్ వాజిద్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

మౌన ప్రదర్శన..

సంబాల్ నగరంలో షాహి జామా మసీదు సర్వే సందర్భంగా నలుగురు యువకులు కాల్పుల్లో మృతి చెందడాన్ని నిరసిస్తూ నగరంలోని ముస్లింలు మౌన ప్రదర్శన నిర్వహించారు. జెడ్పీ సెంటర్‌లో అంబేడ్కర్‌విగ్రహానికి, అనంతరం సీపీకి వినతి పత్రం అందజేశారు. అవామె ఏహింద్ రాష్ట్ర చైర్మన్, ఖమ్మం జైన్ మసీదు ఇమాం హఫీజ్ జవ్వాద్ మాట్లాడారు. ఎంపీజే అధ్యక్షుడు షేక్‌ఖాసీం, నాయకులు హకీం, బాబు, మోహినుద్దిన్, హమీద్, ముస్తాఖిన్, చోటేబాబా, ఎండి.అసద్‌ఉన్నారు.

పింఛన్లు ఇవ్వాలి

తిరుమలాయపాలెం: బోదకాలు (ఫైలేరియా) వ్యాధిగ్రస్తులకు సర్టిఫికెట్లు అందించి రూ.10వేల పించన్ అందించి ఆదుకోవాలని సోమవారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, తదితరులు పాల్గొన్నారు.

గుంటుమల్లన్న ఆలయంలో పూజలు


కుంకుమ పూజకు హాజరైన మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు కుంకుమ పూజ నిర్వహించగా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు స్వాగతం పలకగా పూజలు అనంతరం సన్మానించారు. ఆలయ ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ పాల్గొన్నారు.

వరి పంట పండింది..


వరి కోస్తున్న హార్వెస్టర్

మండలాల వారీగా వరిసాగు

మండలం	వరిసాగు(ఎకరాల్లో)
నేలకొండపల్లి	27,286
కూసుమంచి	24,024
తిరుమలాయపాలెం	13,272
ఖమ్మం రూరల్	6,947
కామేపల్లి	6,057
రఘునాథపాలెం	4,790
ఖమ్మం అర్బన్	2,169

రైతన్నలకు కలిసొచ్చిన ఖరీఫ్

- జోరందుకున్న వరి కోతలు
- మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్‌తో అన్నదాతల ఆనందం

కామేపల్లి: వాతావరణ పరిస్థితులు అనుకూలించినందున రైతులకు ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. పంటకు అవసరమైన సమయంలో వర్షాలు కురవడంతో పంట ఎదుగుదల ఆశాజనకంగా ఉండడం , ఈ ఏడాది అంతగా తెగుళ్ల బెడద లేకపోవడంతో పంట దిగుబడులు పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వరి కోతలు ప్రారంభించగా మరో పది రోజుల్లో కోతలు మరింత జోరందుకోనున్నాయి. ప్రభుత్వం ముందస్తుగానే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ ఏడాది అధిక వర్షాలు కురిసినప్పటికీ వాతావరణం మాత్రం వరి పంట సాగుకు కాలం కలిసొచ్చిందని చెప్పొచ్చు. నారు పోసిన మొదలుకొని నాటు వేసి పంట చివరిదశ వరకు వర్షాలు కురవడంతో పంట ఎదుగుదల రైతులు ఆశించిన స్థాయిలో ఎదిగింది. పంట ఎదుగుదలతో పాటు ఈ ఏడాది తెగుళ్ల బెడద లేకపోవడంతో పెట్టుబడి ఖర్చులు పూర్తిగా తగ్గిపోవడంతో రైతులకు ఖరీఫ్ సాగు కలిసొచ్చింది. తెగుళ్లు, దోమ పోటు లేకపోవడంతో రైతులు ఆశించిన స్థాయికంటే ఈ ఏడాది అధిక దిగుబడి వస్తోందంటున్నారు. ఎకరాకు సుమారుగా 40 నుంచి 45 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందస్తుగానే పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. మంచి దిగుబడి మార్కెట్ మంచి ధర ఉండడంతో వరి సాగు రైతులు ఖుషీ ఖుషీ అవుతున్నారు.

పుష్కలంగా ఉపాధి..

వరి కోతలు ప్రారంభం కావడంతో స్థానికంగా రైతు కూలీలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. హార్వెస్టరు, ట్రాక్టర్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. సుమారుగా వరి కోతలు నెలన్నర పాటు సాగే అవకాశం ఉంది. దీంతో కూలీలకు, యంత్రాలకు డిమాండ్ పెరిగింది. ఓ పక్క కొంత మంది రైతులు హార్వెస్టర్లతో వరికోతలు ప్రారంభించగా మరో పక్క రైతులు కూలీలతో కోతలు చేపట్టారు. ఎక్కువ మంది రైతులు హార్వెస్టర్లతోనే వరి కోతలు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఒక్కసారీ మందు కొట్టలేదు..



రెండెకరాల్లో వరి సాగు చేశా. నాట్లు వేసినప్పటి నుంచి కోతకు వచ్చే వరకు ఎదుగుదల, దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఆశించిన దానికంటే దిగుబడి వచ్చే అవకాశముంది. నాట్లు, ఎరువులకు మాత్రమే పెట్టుబడి పెట్టా. తెగుళ్ల లేకపోవడం పురుగు మందుల అవసరం రాలేదు.

– మల్లెంపాటి శ్రీనివాసరావు, జాస్తిపల్లి, కామేపల్లి మండలం

మార్కెట్‌లో మంచి ధర..



ఖరీఫ్‌లో సన్నరకం వరి ధాన్యాన్ని సాగు చేశా. దిగుబడి బాగుంది. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు అదనంగా మరో రూ.500 బోనస్ చెల్లించనుండడంతో పంటకు గిట్టుబాటు అవుతుంది. నాణ్యత పాటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు సిద్ధమవుతున్నా.

– బానోత్ భీముడునాయక్, పండితాపురం, కామేపల్లి

ఆశాజనకంగా దిగుబడి



ఖరీఫ్‌లో వరి పంట ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే చెరువులు, కుంటల కింద హార్వెస్టర్లతో వరి కోతలు జోరందుకున్నాయి. పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు నాణ్యత ఆధారంగా ధాన్యం తీసుకొచ్చి మద్దతు, ధర, బోనస్ పొందొచ్చు.

– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి